# రామయ్య హుండీ ఆదాయం రూ.1.68 కోట్లు


కానుకలను లెక్కిస్తున్న దేవస్థానం అధికారులు

భద్రాచలం, జూన్ 12 : భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం హుండీలను బుధవారం లెక్కించగా.. 41 రోజులకు రూ.1,68,54,129లు సమకూరినట్లు ఈవో ఎల్.రమాదేవి తెలిపారు. భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకల ద్వారా రూ.1.68 కోట్లు, బంగారం 117 గ్రాములు, వెండి 1.300 గ్రాములు వచ్చిందని పేర్కొన్నారు. అలాగే 557 అమెరికన్ డాలర్లు, 5 ఖతర్ రియాల్స్, 20 ఇంగ్లాండ్ ఫౌండ్స్, 20 ఫిలిఫైన్స్ పీసో, 950 నేపాల్ రూపాయలు, 20 యూఏఈ దిరాన్స్, 14 మలేషియా రింగిట్స్, 60 ఆస్ట్రేలియా డాలర్లు, 20 కెనడా డాలర్లను భక్తులు స్వామివారికి కానుకల రూపంలో సమర్పించారని తెలిపారు. వేసవి సెలవులు కావడంతో భక్తులు స్వామివారిని దర్శించుకొని కానుకలు సమర్పించారని, గతంతో పోలిస్తే స్వామివారి ఆదాయం పెరిగిందని పేర్కొన్నారు. గతంలో మే 2న హుండీలను తెరిచి లెక్కించామన్నారు.


పిచ్చిమొక్కలతో కొత్తూరు పాఠశాల ఆవరణ


లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల యూపీ స్కూల్‌లో తక్కువ మంది పిల్లలతో ప్రార్థన చేయిస్తున్న ఉపాధ్యాయులు

- భద్రాద్రి జిల్లాలో వెలవెలబోయిన సర్కారు బడులు
- 1,69,510 మందికి 33,396 మంది పిల్లలే హాజరు
- ఫలితమివ్వని 'బడిబాట'
- మరమ్మతులకు నోచుకోని ప్రభుత్వ పాఠశాలలు
- అరకొర సౌకర్యాలతో పునఃప్రారంభమైన స్కూళ్లు

# తొలిరోజు తుస్సు..

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 12 (నమస్తే తెలంగాణ) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తొలిరోజు సర్కారు బడులు తుస్సుమన్నాయి. విద్యార్థులు అనుకున్న సంఖ్యలో రాకపోవడంతో పాఠశాలలు వెలవెలబోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటంగా నిర్వహించిన 'బడిబాట' కార్యక్రమం ఏమాత్రం ఫలితమివ్వలేదు. జిల్లా మొత్తంలో లక్షల సంఖ్యలో ఉన్న విద్యార్థులు మొదటిరోజు వేలసంఖ్యకు పడిపోయారు. బడికి రావాల్సిన పిల్లలు బడిబయట ఆడుకునే పరిస్థితి వచ్చింది. బడిబాట పేరుతో ఈ నెల 6వ తేదీ నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీలు చేసి మరీ అవగాహన కల్పించినా పిల్లల సంఖ్య ప్రారంభం రోజు లేకపోవడంతో పాఠశాలలు బోసిపోయాయి. 'మన ఊరు-మన బడి' ద్వారా గత కేసీఆర్ సర్కారు కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన విషయం విదితమే. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలలపై దృష్టి పెట్టకపోవడంతో ప్రారంభరోజు వెలవెలబోవాల్సి వచ్చింది. ఇటీవల కొలువుదీరిన కాంగ్రెస్ సర్కారు 'మన ఊరు-మన బడి' స్థానంలో అమ్మ ఆదర్శ పాఠశాలలు అని పేరు పెట్టి నిధులు మంజూరు చేసినా ఆ పాఠశాలలకు కనీసం రంగులు కూడా వేయని దుస్థితి దాపురించింది. పాత గోడలు, మరమ్మతు చేయని గోడలు దర్శనమిస్తున్నాయి. పిల్లలకు తొలిరోజు ఒకజత యూనిఫాం ఇవ్వాల్సి ఉండగా.. 20 శాతం పాఠశాలలకు యూనిఫాం ఇవ్వలేకపోయారు. లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల యూపీ స్కూల్‌లో విద్యార్థులకు యూనిఫాం ఇవ్వలేదు. రేగళ్ల పాఠశాలనే కాదు జిల్లాలోని చండ్రుగొండ, బూర్గంపాడు, కొత్తగూడెం మండలాల్లోని కొన్ని పాఠశాలలకు యూనిఫాంలు అందలేదని అక్కడి ఉపాధ్యాయులే చెప్పడం గమనార్హం.


బడిలో ఉండాల్సిన పిల్లలు తొలిరోజే రోడ్డుపై ఆటలు

## ప్రారంభంలోనే తగ్గిన విద్యార్థులు

పునఃప్రారంభం రోజు మామిడి తోరణాలతో తళుక్కున మెరవాల్సిన పాఠశాలలు విద్యార్థులు లేక వెలవెలబోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా చెప్పొచ్చు. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో జిల్లాలో 642 పాఠశాలలకు రూ.26 కోట్లు మంజూరు చేసినా అవి మరమ్మతులకు నోచుకోలేకపోవడం విచారకరం. ప్రస్తుతం అవి పాతరంగులతో వెలవెలపోతున్నాయి. లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల యూపీ స్కూల్‌కు తొలిరోజు 18 మంది పిల్లలే వచ్చారు. కొంతమంది విద్యార్థులు ఇంటివద్దనే ఆటలు ఆడుకుంటున్నారు. రేగళ్లతండాలో ఉన్న ఆశ్రమ పాఠశాలలో 200 మంది విద్యార్థులకు కేవలం 13 మందే స్కూల్‌కు వచ్చి ప్రార్థనలో పాల్గొన్నారు. అక్కడ 17 మంది టీచర్లు ఉండగా.. 13 మంది మాత్రమే పిల్లలు రావడం గమనార్హం.

## అరకొర సౌకర్యాలతో..

పాఠశాలల ఆవరణలు ఇంకా పిచ్చిమొక్కలతోనే దర్శనమిస్తున్నాయి. మరుగుదొడ్లు సక్రమంగా లేవు.. మిషన్ భగీరథ తాగునీరు అంతంతమాత్రమే. కొన్ని పాఠశాలల్లో మొక్కుబడిగా భగీరథ ట్యాప్‌లు గోడలకు ఏర్పాటు చేశారు. పాఠశాలను శుభ్రం చేయాల్సిన స్వీపర్లకు వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు.

మహిళా సంఘాల ద్వారా విద్యార్థులకు యూనిఫాంలు కుట్టించాం. దాదాపు అన్ని పాఠశాలలకు సరిపడా క్లాత్‌లు ఇచ్చాం. చాలా తొందరగా కుట్టు పనులు పూర్తయ్యాయి. కేవలం 20 శాతం మాత్రమే అందలేదు..

### 20 శాతం యూనిఫాంలే అందలేదు..



రెండు రోజుల్లో క్లియర్ అవుతుంది. తొలిరోజు కదా అని కొంతమంది తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపలేదు.. అందుకే సంఖ్య తగ్గింది. అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతులు ముమ్మరంగా జరుగుతున్నాయి. త్వరలోనే పూర్తి చేస్తాం.

– వెంకటేశ్వరాచారి, డీఈవో, భద్రాద్రి కొత్తగూడెం

# విద్యకు అత్యంత ప్రాధాన్యం

**సర్కారు బడులలో ఇంగ్లిష్ మీడియాన్ని ప్రోత్సహిస్తాం**

**పాఠశాలల పునఃప్రారంభంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల**

**ప్రారంభమైన పాఠశాలలు.. తొలి రోజు 43 శాతం విద్యార్థుల హాజరు**


విద్యార్థికి యూనిఫాం, పుస్తకాలు అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల, చిత్రంలో జడ్పీ చైర్మన్ లింగాల, కలెక్టర్ గౌతమ్

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 12 : తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ నిర్మాణం కోసం విద్యకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సర్కారు బడులలో ఇంగ్లిష్ మీడియాన్ని కూడా ప్రోత్సహిస్తున్నామని అన్నారు. నూతన విద్యా సంవత్సరం సందర్భంగా ఖమ్మంలోని ఎన్ఎస్‌సీ పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన పాఠశాలల పునఃప్రారంభ కార్యక్రమానికి వారు హాజరయ్యారు. తొలుత విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యాభివృద్ధి కోసం తమ ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తుందని తెలిపారు. విద్యాభివృద్ధికి పాటుపడుతున్నందునే ప్రభుత్వ పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు అందజేస్తున్నామని అన్నారు. విద్య కోసం ఎంతటి వ్యయాన్ని వెచ్చించేందుకైనా ప్రభుత్వం వెనకాడబోదని, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. మెగా డీఎస్సీ ద్వారా సుమారు 10 వేల పోస్టులను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, కలెక్టర్ వీపీ గౌతమ్, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా, డీఈవో సోమశేఖర శర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఏర్పాట్లపై కలెక్టర్ అసంతృప్తి

పాఠశాలలు పునఃప్రారంభం సందర్భంగా ఖమ్మం ఎన్ఎస్‌సీ పాఠశాలలో చేసిన ఏర్పాట్లపై కలెక్టర్ వీపీ గౌతమ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం, మంత్రి హాజరైన ఈ కార్యక్రమానికి ప్రొటోకాల్‌కు అనుగుణంగా ఏర్పాట్లు చేయలేదంటూ డీఈవోపై అసహనం వ్యక్తం చేశారు. అలాగే, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసి చాలా రోజులైనప్పటికీ వాటికి సంబంధించిన పోస్టర్లను సదరు పాఠశాల గోడలపై తొలగించకపోవడం, డిజిటల్ తరగతుల కంప్యూటర్లను ఆన్‌చేసి పరిశీలించకపోవడం వంటి వాటి పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల గురించి డీఈవోను, ప్రధానోపాధ్యాయుడిని కలెక్టర్ ప్రశ్నించగా.. కొందరు స్వయం సహాయక గ్రూపుల సభ్యులను చూపించారు.

### తొలి రోజు 43 శాతం హాజరు..

జిల్లాలో తొలి రోజు పాఠశాలలకు 43 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా 21 మండలాల్లోని అన్ని రకాలకు చెందిన 2,490 ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10 తరగతుల విద్యార్థులు 61,314 మంది ఉన్నారు. కాగా, నూతన విద్యా సంవత్సరంలో పాఠశాలలు పునఃప్రారంభమైన మొదటి రోజైన బుధవారం నాడు 26,540 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆయా పాఠశాలలను ఎంఈవోలు, సెక్టోరల్ అధికారులు పరిశీలించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి

**బడిబాటలో భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక, జెడ్పీ చైర్మన్ కంచర్ల**


చుంచుపల్లి : ఏకరూప దుస్తులు అందజేస్తున్న కలెక్టర్ ప్రియాంక, జెడ్పీ చైర్మన్

చుంచుపల్లి/పాల్వంచ, జూన్ 12 : నిష్ణాతులైన ఉపాధ్యాయులు బోధించే ప్రభుత్వ పాఠశాలల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల, జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావులు కోరారు. పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా బుధవారం చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో, పాల్వంచ మండలం ప్రశాంత్‌నగర్ ఎంపీపీఎస్‌లో చేపట్టిన బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాలల పునఃప్రారంభం కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో జరుపుకోవడం మంచి పరిణామమన్నారు. పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించిందన్నారు. ప్రభుత్వ కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. అనంతరం బడిబాట వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, అదనపు కలెక్టర్ విద్యాచందన, ఆర్డీవో మధు, డీఈవో వెంకటేశ్వరాచారి, ఎంఈవో జుంకీలాల్, ఎంపీపీ బాదావత్ శాంతి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ రాజకుమారి, స్పెషల్ ఆఫీసర్, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీవో అశోక్, ఎంపీవో సత్యనారాయణ పాల్గొన్నారు.


రామకృష్ణాపురంలో సర్వేను పరిశీలిస్తున్న సీఈ సదాశివకుమార్

# పకడ్బందీగా నమోదు చేయాలి

**మిషన్ భగీరథ సీఈ శ్రీనివాసరావు**

చింతకాని, జూన్ 12 : మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ వివరాలను ఇంటింటికి తిరుగుతూ యాప్‌లో పకడ్బందీగా నమోదు చేయాలని మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరావు ఆదేశించారు. రామకృష్ణాపురం గ్రామంలో చేపట్టిన మిషన్ భగీరథ ఇంటింటి నల్లా కనెక్షన్ వివరాల నమోదు ప్రక్రియను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు పల్లెల్లో మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటిని వాడుకుంటున్న వారి వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. యజమాని ఫోన్, ఇంటి నంబర్, ఆధార్ నంబర్ తదితర వివరాలను సిబ్బంది యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారని, జిల్లావ్యాప్తంగా ఈ సర్వే కొనసాగుతోందన్నారు. అనంతరం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్వే సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్ఈ సదాశివకుమార్, డీఈ దొడ్డపునేని నరసింహారావు, ఏఈలు భాస్కర్, జయరాజు, పంచాయతీ కార్యదర్శి డేగల సురేశ్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

# రేపు జడ్పీ సర్వసభ్య సమావేశం

మామిళ్లగూడెం, జూన్ 12 : ఖమ్మం జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 14న జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు సీఈవో వినోద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి జడ్పీటీసీలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీపీలు హాజరవుతున్నారని పేర్కొన్నారు. అన్ని శాఖల జిల్లాస్థాయి అధికారులు అభివృద్ధి, సంక్షేమ పథకాల నివేదికలతో సకాలంలో హాజరుకావాలని సూచించారు

# ఖమ్మంలో రోడ్డెక్కిన నిరుద్యోగులు

**జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సౌకర్యాల కల్పనకు డిమాండ్**

**కనీసం కుర్చీలు, మంచినీళ్లు, మరుగుదొడ్లు లేవంటూ ఆందోళన**

**కేసులు పెడతామంటూ పోలీసులు బెదిరించడంతో విరమణ**


ఖమ్మంలో బస్ డిపో రోడ్డుపై బైఠాయించి ప్లకార్డులతో ఆందోళన చేస్తున్న ఉద్యోగార్థులు, నిరుద్యోగ యువతీ యువకులు

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 12: ఖమ్మం జిల్లా గ్రంథాలయంలోని సమస్యలపై పాఠకులు రోడ్డెక్కారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు తామంతా గ్రంథాలయానికి వస్తే.. తమకిక్కడ కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదంటూ నిరుద్యోగులు, ఉద్యోగార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు పక్కనే ఉన్న బస్ డిపో రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ ప్లకార్డులతో నినాదాలు చేశారు. చదువుకోవడానికి గ్రంథాలయానికి వస్తే కూర్చోడానికి కుర్చీలు, తాగడానికి మంచినీళ్లు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. చివరికి అత్యవసరానికి వెళ్దామన్నా కనీసం మరుగుదొడ్లు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు.

## వందల సంఖ్యలో పాఠకులు..


ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్‌కు ఆనుకొని జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉంది. అందులోని ఓ వైపున కొత్త భవనంలో డిజిటల్ లైబ్రరీతోపాటు కొన్ని పుస్తకాలు ఉండేవి. మరోవైపున పాత భవనంలో ఇంకొన్ని పుస్తకాలు, దినపత్రికలు ఉండేవి. అయితే పాత భవనం అప్పటికే శిథిలావస్థకు చేరుకొని ఉంది. ఆరు నెలల క్రితం అది పేకమేడలా కూలిపోయింది. అప్పటి నుంచి కొత్త భవనంలోనే పాఠకులందరూ పఠనం చేస్తున్నారు. జిల్లా గ్రంథాలయం కావడంతో నిత్యం వందల సంఖ్యలో నిరుద్యోగులు, ఉద్యోగార్థులు వస్తుంటారు. ఇంత రద్దీ ఉన్న ఈ గ్రంథాలయంలో కనీసం కుర్చీలు గానీ, తాగడానికి మంచినీళ్లుగానీ, అత్యవసరమై వెళ్లడానికి మరుగుదొడ్లుగానీ లేవు. కొత్త భవనంలో ఒకటీ అరా ఉన్నప్పటికీ ఇంత పెద్ద సంఖ్యలో ఉన్న పాఠకులకు అవి సరిపోవడం లేదు. దీంతో రోజూ ఇబ్బందులు పడుతూ నెట్టుకొస్తున్నప్పటికీ పాలకులు పట్టించుకోవం లేదు. దీంతో నిత్యం తాము ఇక్కడ పడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు, పాలకులకు తెలియజెప్పేందుకు నిరుద్యోగ యువతీ యువకులు నిర్ణయించుకున్నారు. అంతా ఏకమై బుధవారం గ్రంథాలయం ఎదుట డిపో రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళనకారులను సముదాయించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, నిరుద్యోగులకు మధ్య కొంత సేపు వాగ్వాదం జరిగింది. అయినప్పటికీ తమ సమస్యలను పరిష్కరించాలంటూ పాఠకులు పట్టుబట్టారు. అయితే, ఆందోళనను విరమించకుంటే అందరిపైనా కేసులు నమోదు చేస్తామంటూ పోలీసులు బెదిరింపులకు దిగారు. దీంతో తమ భవిష్యత్తు దృష్ట్యా ఉద్యోగార్థులు, నిరుద్యోగులు ఆందోళన విరమించారు.

# మేనేజ్‌మెంట్ ట్రైనీ మైనింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెం సింగరేణి, జూన్ 12 : బీటెక్ మైనింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు మేనేజ్‌మెంట్ ట్రైనీ మైనింగ్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు జీఎం పర్సనల్ బీఆర్ దీక్షితులు ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి సంస్థలో ఏప్రిల్ 23న విడుదల చేసిన ఎక్స్‌టర్నల్ ఎంప్లాయ్‌మెంట్ నోటిఫికేషన్ నంబర్ 01/2024కు కొనసాగింపుగా కొరిజెండమ్(సవరణ)ను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. బీటెక్ మైనింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు సింగరేణి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.




# మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

టేకులపల్లి, జూన్ 12 : మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని టేకులపల్లి మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో సిబ్బందికి సీఐటీయూ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ స్కూళ్లల్లో నాలుగునెలల నుంచి భోజన బిల్లులు, ఎగ్ బిల్స్, వేతనాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగిన బిల్లులు, జీతాలను తక్షణమే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె.వీరన్న, ఈసం నాగలక్ష్మి, సోనా, మహేశ్వరి, రమణ పాల్గొన్నారు.

- 'కోయచలక'లో 'హస్తం' నాయకుల బెదిరింపులు
- వేధింపులతో ఇప్పటికే పలువురు 'చేతి పార్టీ'లో చేరిక
- కాంగ్రెస్ నేతల తీరుపై గ్రామస్తుల భయాందోళన

# కాంగ్రెస్‌లోకి మారకుంటే.. 'పింఛన్' పీకేస్తాం

రఘునాథపాలెం, జూన్ 12 : ప్రజాస్వామ్యంలో ప్రాథమికమైనది ఓటు హక్కు. ఓ ఓటరు తన పాలకుడిగా ఎవరిని ఎంచుకోవాలన్నది కేవలం అతడి అభీష్టం. అంతటి స్వేచ్ఛను కల్పించిన గొప్పదనం మన రాజ్యాంగానిది. అలాగే, రాజకీయ పార్టీలను ఎంచుకోవడంలోనూ, వాటిని అభిమానించడంలోనూ, వాటిల్లో కొనసాగడంలోనూ, కొనసాగకపోవడంలోనూ పూర్తి స్వేచ్ఛ ప్రజలది, ఓటర్లదే. అలాగే, ప్రజాతీర్పును, ప్రజాభిప్రాయాన్ని ఆమోదించడం, గౌరవించడం ఆయా పార్టీల విధి. అధిక శాతం మంది ప్రజలు తమకు అందించిన అధికారాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రజలందరికీ (ఆ పార్టీకి ఓటు వేసిన వారికి, ఆ పార్టీకి ఓటు వేయని వారికి) నిష్పక్షపాత పాలన అందించాలి. కానీ.. తెలంగాణలో ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తీరు అలా లేదు. ముఖ్యంగా ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలో ఆ పార్టీ నాయకుల తీరు అసలే లేదు.

## మా పార్టీలోకి రావాల్సిందే..

'అధికారం మాది. పెత్తనం మాది. ఇంతకుముందు ఏ పార్టీలో ఉన్నవాళ్లయినా సరే.. ఇప్పుడు మర్యాదగా మా పార్టీలోకి మారాలి. లేకుంటే మామూలుగా ఉండదు. అవసరమైతే ప్రభుత్వ పింఛన్ పీకేస్తాం' అంటూ బెదిరింపులకు దిగుతున్నారు రఘునాథపాలెం మండలంలోని కోయచలక గ్రామ కాంగ్రెస్ నాయకులు. వీరి వేధింపులతో ఇప్పటికే చాలామంది ప్రజలు తమ పార్టీలపై ఉన్న అభీష్టాలను కూడా మార్చుకుంటున్నారు. ఇంకొందరు గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. 'రాష్ట్రంలో మేమే అధికారంలో ఉన్నాం. అందుకని మేం చెప్పినట్లే వినాలి. మేం చెప్పిందే చేయాలి.' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి వేధింపులతో ఇప్పటికే ఎన్నో ఏళ్లుగా పింఛన్ అందుకుంటున్న లబ్ధిదారులను తమ పార్టీలోకి రప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే వీరి హూంకరింపులతో వణికిపోతున్న కొందరు ప్రజలు, లబ్ధిదారులు ఇప్పటికీ ఆ పార్టీ కండువాలు కప్పుకున్నట్లు తెలిసింది.

## పింఛన్ లబ్ధిదారులే టార్గెట్‌గా..

ముఖ్యంగా ఇక్కడి కాంగ్రెస్ నాయకులు.. ఆసరా పింఛన్ లబ్ధిదారులను టార్గెట్ చేసుకున్నారు. పింఛన్ తొలగిస్తామన్న అస్త్రంతో లబ్ధిదారులను వారి పార్టీలో చేర్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారని గ్రామస్తులు కొందరు ఆరోపిస్తున్నారు. త్వరలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో గ్రామస్థాయిలో ఇప్పటికే బలంగా ఉన్న బీఆర్ఎస్‌ను ఖాళీ చేయాలని కాంగ్రెస్ నాయకులు కంకణం కట్టుకున్నట్లుగా తెలుస్తోంది. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, ఇతర వృత్తిదారులకు.. గడిచిన పదేళ్లుగా కేసీఆర్ ప్రభుత్వం పెంచి అందించిన ఆసరా పింఛన్లు ఎంతో అక్కరకొస్తున్నాయి. దీంతో వారంతా ఉద్యమనేతకు ఆసరాగా, అండగా ఉంటూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో వారి మనసులను, ఓట్లను అభిమానంతో గెలుచుకోలేక.. భయంతో లాక్కోవాలని చూస్తున్నారు. ప్రతి నెలా ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్లను లబ్ధిదారుల అర్హతా ప్రమాణాలతో కాకుండా.. తమ పార్టీలో చేరారా? లేదా? అనే ప్రాతిపదికన ఇచ్చేలా కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు అంటున్నారు. పైగా 'పింఛన్ రావాలంటే.. మా మూడు రంగుల జెండా కప్పుకోవాల్సిందే' అంటూ హుకుం జారీ చేస్తుండడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారంలో ఉన్న పార్టీలు, ప్రభుత్వాలు మంచి పనులతో ప్రజల మనసులు గెలుచుకోకుండా.. ఇలా భయభ్రాంతులతో బలవంతంగా పార్టీలో చేర్చుకోవడం ఏంటని గ్రామస్తులు కొందరు మండిపడుతున్నారు.

